సాక్షి విశాఖపట్నం

సోమవారం : 20 : మే : 2024



కల్యాణ వైభోగమే..
కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రగతి పథంలో హార్బర్
ఉత్తరాంధ్రలో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 8లో



ఇన్వెస్టిగేషన్ వదిలి.. 8లో

గంగపుత్రుల జీవన చిత్రం









నిరంతరం శ్రమిస్తూ ఏడాదిలో సగకాలానికిపైగా సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం అమల్లో ఉండడంతో వారంతా బోట్ల మరమ్మతులు, కొత్త బోట్ల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు వలలు సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ 15న వేటకు వెళ్లే సమయానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. రోజూ మత్స్యకారులంతా బృందాలుగా పనుల్లో నిమగ్నమవుతున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సిటీలో సూపర్ సండే..



సాగరి నగరిలో అణువణువూ అద్భుతమే. అందాల తీరంలో అలలతో ఆటలాడాలన్నా.. హొయలొలికే బీచ్‌రోడ్డులో బ్యూటిఫుల్ డ్రైవ్ చెయ్యాలన్నా.. కైలాసగిరిపై నుంచి సుందర ప్రపంచాన్ని చూడాలన్నా.. ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతుంటారు. అలాంటిది. అసలే ఆదివారం.. ఆపై అందాల నగరిలో అద్భుతమైన వాతావరణం.. స్టీల్ సిటీ కాస్తా.. బ్లూ సిటీగా మార్చేలా అటు ఆకాశం.. ఇటు సాగరం నీలివర్ణాన్ని అద్దుకుంటూ అందరికీ ఆహ్వానం పలికాయి. చిన్నా పెద్దల కేరింతలతో సండే సందడి నెలకుంది.

- ఫొటోగ్రాఫర్ : పీఎల్ మోహన్‌రావు





21 నుంచి ఐఐపీఈలో సదస్సు

ఏయూక్యాంపస్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ, స్టోనీ బ్రూక్స్ యూనివర్సిటీ(న్యూయార్క్)తో సంయుక్తంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హైడ్రోజన్, గ్లోబల్ డీకార్బనైజేషన్ ఇండో–యూఎస్ వర్క్‌షాప్ నిర్వహించనుందని ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ డీకార్బనైజేషన్ ప్రయత్నాలలో కీలకమైన అంశంగా నిలిచే హైడ్రోజన్‌పై చర్చించే వేదికగా ఇంధన రంగంలోని పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌ల కోసం ప్రత్యేకంగా ఫోరం రూపొందించామన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా హైడ్రోజన్‌పై ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, కార్బన్ తక్కువగా ఉండే ప్రత్యామ్నాయాలు, వాతావరణ మార్పు, శిలాజ ఇంధనాలపై సమగ్ర సెషన్లు ఉంటాయన్నారు. విద్య, పరిశోధన కేంద్రాలు, విధాన రూపకర్తలు, నిపుణులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ మాజీ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఉజ్వల్ కాంతి భట్టాచార్య హాజరవుతారు. విశిష్ట అతిథిగా సింహాద్రి ఎన్‌టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ ఎస్.కె.సిన్హా పాల్గొంటారు.

జూలో ఆఫ్రికన్ కోతులు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అరుదైన కోతి జాతులున్నాయి. ఇటీవల శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులు వీటిని విశాఖ జూ పార్కుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ కోతులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. కొందరు ఒడిశా రాష్ట్రం మీదుగా వేరే చోటకు అనధికారికంగా ఆఫ్రికన్ జాతికి చెందిన రెండు కోతులను తరలిస్తుండగా శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులకు పట్టుబట్టారు. వీటిని జూకు అప్పగించినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వీటిని జూలో కోతుల జోన్‌లో ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లో సందర్శకుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాతి కోతులను 'లోయిస్ట్ మంకీస్' అని పిలుస్తారన్నారు. ఈ జాతి ఆఫ్రికా ఖండం కాంగో ప్రాంతంలో సంచరిస్తాయన్నారు. ఈ జాతి కోతులు మన దేశంలో ఎక్కడా కనిపించవని తెలిపారు. ఇవి అరుదైన జాతికి చెందినవని తెలిపారు.

సైలెంట్ మోడ్‌లో సీబీఐ.!

నత్తనడకన డ్రగ్స్ కేసు దర్యాప్తు

- మౌనం వహిస్తున్న దర్యాప్తు బృందం
- భారీగా లభ్యమైనా కనిపించని పురోగతి
- సంధ్యా ఆక్వా ప్రతినిధులను తూతూ మంత్రంగా విచారించిన వైనం
- డ్రగ్స్ తీసుకొచ్చిన సంస్థను గాలికొదిలేసిన సీబీఐ
- ఆధారాలేవీ సేకరించకుండా బ్రెజిల్‌కి ఇలా వెళ్లి అలా వచ్చేసిన బృందం

సాక్షి, విశాఖపట్నం: ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి.. భారీగా డ్రగ్స్ పట్టుకున్న సీబీఐ దాని వెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారులను కనిపెట్టే విషయంలో మాత్రం నిర్లిప్తత వహిస్తోంది. మూలాలు శోధించేందుకు బ్రెజిల్ వెళ్లిన బృందాలు కొండని తవ్వి కనీసం ఎలుక జాడ కూడా కనిపెట్టలేకపోయాయి. ప్రధాన పాత్రధారులుగా ఉన్న సంధ్యా ఆక్వా ప్రతినిధులు కళ్లెదుటే ఉన్నా కనీసం సమగ్రంగా విచారించకుండా వదిలేయడంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్స్ తీసుకొచ్చిన సంస్థపై చర్యలు తీసుకోకుండా గాలికొదిలేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్చి 19న విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ (వీసీటీపీఎల్)లో 25 వేల కిలోల డ్రైఈస్ట్‌తో పాటు పెద్ద ఎత్తున డ్రగ్స్ దిగుమతి రాకెట్‌ని సీబీఐ బట్టబయలు చేసింది. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన షిప్‌లోని కంటైనర్‌లో డ్రైఈస్ట్‌ని తీసుకొచ్చిన సంధ్యా ఆక్వా సంస్థ.. అందులో డ్రగ్స్ ఎలా వచ్చాయో తమకు తెలీదంటూ బుకాయిస్తోంది. డ్రగ్స్ దొరికిన తొలి రోజున సంస్థ ప్రతినిధులను రెండు గంటల సేపు మాత్రమే సీబీఐ అధికారులు విచారించారు. తమకేమీ తెలీదని చెప్పడంతో వదిలేశారు. తర్వాత ఇంత వరకూ సంధ్యా ఆక్వా ప్రతినిధుల జోలికి సీబీఐ వెళ్లకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రాథమికంగా సంధ్య ఆక్వా ప్రతినిధుల నుంచి కీలక సమాచారం రాబట్టే అవకాశాలున్నా కనీసం ఆ దిశగా సీబీఐ విచారించకపోవడం గమనార్హం. మొత్తం కంటైనర్‌లో వచ్చిన వెయ్యి బ్యాగుల్లో 70 శాతం బ్యాగ్స్‌లో ఉన్న డ్రైఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథలాక్విన్ తదితర డ్రగ్స్ అవశేషాలున్నాయి. ఈ పరిణామాలు చూస్తుంటే 30 శాతం బ్యాగుల్లో పూర్తి స్థాయిలో డ్రైఈస్ట్ లోడ్ చేసి ఒకవేళ పరీక్షలు నిర్వహించినా దొరకవనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికలతోనే డ్రగ్స్ తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే సీబీఐకి ఇంటర్‌పోల్ నుంచి సమాచారం రావడంతో ఈ రాకెట్ గుట్టురట్టు అయింది. పక్కాగా డ్రగ్స్ అక్రమంగా రవాణా చేసినట్లు ఆధారాలున్నా సంధ్యా ఆక్వాపై ఇంతవరకూ సీబీఐ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



బ్రెజిల్ వెళ్లి ఏం చేశారు..?

మరోవైపు డ్రగ్స్ మూలాలు ఎక్కడ ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తామంటూ సీబీఐకి చెందిన బృందం బ్రెజిల్ పయనమయ్యాయి. శాంటోస్ పోర్టుకు డ్రైఈస్ట్ తరలించిన ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ సంస్థతో పాటు కార్గో షిప్ వచ్చిన మార్గంతో పాటు షిప్ ఆగిన పోర్టుల్లో సీసీటీవీ ఫుటేజ్ సేకరించాలని సీబీఐ బృందం బ్రెజిల్ వెళ్లినట్లు తెలిసింది. అయితే దాదాపు 2 నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఎలాంటి ఆధారాలు సేకరించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే బ్రెజిల్ నుంచి సీబీఐ బృందం తిరిగి వచ్చేసినట్లు తెలుస్తోంది. కానీ అసలు దర్యాప్తు ఎంత వరకూ వచ్చిందో కూడా సీబీఐ వెల్లడించకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

రిపోర్టులూ మరింత ఆలస్యం.?

తమ దగ్గర ఉన్న కిట్స్ సాయంతో నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో డ్రగ్స్ అవశేషాలున్నట్లు సీబీఐ గుర్తించింది. అయితే ఒక్కో బ్యాగ్‌లో ఎంత మొత్తం డ్రగ్స్ ఉన్నాయి.. ఏఏ డ్రగ్స్ ఎంత మేర ఉన్నాయన్న అంశంపై సమగ్ర నివేదిక కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపించారు. అయితే ఇంతవరకూ దీనికి సంబంధించిన రిపోర్టులు రాలేదని సీబీఐ చెబుతోంది. సాధారణంగా ఎఫ్ఎస్ఎల్ నుంచి 10 నుంచి 15 రోజుల్లో నివేదిక వస్తుందని సంధ్యా డ్రగ్స్‌కు సంబంధించిన రిపోర్టు దాదాపు రెండు నెలలు కావస్తున్నా బయటికి రాకపోవడంపైనా సీబీఐ తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ కంటైనర్ అక్కడే..

రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్ విషయంలోనూ సీబీఐ నిర్లక్ష్యం వహిస్తోంది. ఎక్కడైతే తనిఖీలు నిర్వహించారో ఆ ప్రాంతమైన వీసీటీపీఎల్‌లోనే డ్రగ్స్ దొరికిన కంటైనర్‌ని సీబీఐ సీజ్ చేసి విడిచిపెట్టేసింది. కంటైనర్ టెర్మినల్‌లో కస్టమ్స్ తనిఖీల్లో పట్టుబడిన కంటైనర్లతో పాటు ఈ డ్రగ్స్ కంటైనర్ కూడా విడిచిపెట్టేశారు. ఎర్రచందనం, నిషేధిత వస్తువులతో వచ్చిన కంటైనర్లను వీసీటీపీఎల్‌లోని ఓ ప్రాంతంలో ఉంచేస్తారు. దాదాపు 10 నుంచి 15 ఏళ్లుగా ఈ కంటైనర్లు ఇక్కడే ఉన్నాయి. వాటితో పాటుగా.. డ్రగ్స్ కంటైనర్‌ని కూడా సీబీఐ విడిచి పెట్టేసింది. కస్టమ్స్, వీసీటీపీఎల్ ప్రతినిధుల్ని ఆ కంటైనర్ భద్రపరచాలని సీబీఐ సూచించిందే తప్ప.. తమ తరపున ఒక భద్రతా సిబ్బందిని కూడా కంటైనర్ వద్ద ఉంచకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. వీలైనంత త్వరగా డ్రగ్స్ దోషులను బయటకి లాగాలని దర్యాప్తును సీబీఐ త్వరగా పూర్తి చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

కొండెక్కిన చికెన్ ధర

- కిలో రూ.300కి చేరిక
- ధర మరింత పెరిగే అవకాశం
- వేసవిలో తగ్గిన కోళ్ల పెంపకం

సాక్షి, విశాఖపట్నం : కొన్నాళ్ల నుంచి ఒకింత అందుబాటు ధరలో ఉన్న చికెన్ ఇప్పుడు చిక్కడం లేదు. రెండు నెలల పాటు కిలో చికెన్ రూ.230–260 మధ్య ఉండేది. మూడు వారాల నుంచి స్వల్పంగా పెరుగుతూ తాజాగా రూ.300కి చేరుకుంది. ఈ ఏడాది మార్చి మూడో వారం నుంచే ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ప్రభావం చూపాయి. ఏప్రిల్ నాటికి అవి తీవ్ర రూపం దాల్చాయి. దీంతో ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు వడగాడ్పుల ధాటికి పెద్ద సంఖ్యలో చనిపోయాయి. రోజురోజుకూ తీవ్ర వడగాడ్పులు అధికమవుతుండడంతో పౌల్ట్రీ రైతులు కోడి పూర్తిగా ఎదగక పోయినా మార్కెట్‌కు తరలించే వారు. ఫలితంగా చికెన్ రేటు దిగి వచ్చింది. ఇలా కిలో చికెన్ మార్చి ఏప్రిల్ నెలల్లో రూ.230–260కి మించలేదు. మరోవైపు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పౌల్ట్రీ రైతులు ఫారాల్లో కోళ్ల పెంపకాన్ని గణనీయంగా తగ్గించారు. కోళ్లను ఫారాల్లో బ్యాచ్‌ల వారీగా పెంచుతారు. కోడి పిల్ల చికెన్‌కు వీలుగా తయారవ్వాలంటే ఏడు నుంచి తొమ్మిది వారాల సమయం పడుతుంది. ఏప్రిల్‌లోనే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మే నెలలో మరింతగా విజృంభించి కోళ్ల మృత్యువాత పడతాయన్న భయంతో పౌల్ట్రీ రైతులు బ్యాచ్‌లను కుదించారు. దీంతో ఇప్పుడు కోళ్లకు కొరత ఏర్పడింది.

డిమాండ్‌కు తగినన్ని బ్రాయిలర్ కోళ్ల లభ్యత లేకపోవడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా ఈనెల ఆరంభంలో కిలో స్కిన్ లెస్ బ్రాయిలర్ చికెన్ రూ.260 ఉండగా ఇప్పుడది రూ.300కి ఎగబాకింది. అంటే 20 రోజుల్లో కిలోపై రూ.40 పెరిగిందన్న మాట! ఫారాల్లో కొత్తగా వేసిన బ్యాచ్‌లు అందుబాటులోకి రావాలంటే మరో మూడు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అందువల్ల కనీసం మరో మూడు వారాల పాటు చికెన్ ధర ప్రియంగానే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకంటే ఇంకాస్త పెరిగే అవకాశాలూ ఉన్నాయని అంటున్నారు. చికెన్ ప్రియులకు ఈ ధర భారంగానే ఉండనుంది. ఉమ్మడి విశాఖ



జిల్లాలో రోజుకు మూడు లక్షలు, ఆదివారాల్లో ఆరు లక్షల కిలోల చికెన్ అమ్ముడవుతుందని అంచనా. బ్రాయిలర్ చికెన్ రేటు కొండెక్కి కూర్చున్న నేపథ్యంలో ఆదివారం ఆ ప్రభావం అమ్మకంపై పడిందని సీతమ్మధారలోని ఓ చికెన్ సెంటర్ నిర్వాహకుడు రామునాయుడు 'సాక్షి'కి చెప్పాడు.

గుడ్ల ధరలూ పైపైకే..

చికెన్ ధర ఇప్పటికే కొండెక్కి కూర్చుంటే.. కోడిగుడ్ల ధరలు కూడా పైపైకే ఎగబాకుతున్నాయి. మార్చిలో వంద గుడ్ల రేటు రూ.425 వరకు ఉండగా, ఏప్రిల్‌లో మరింత క్షీణించి రూ.405కి దిగి వచ్చింది. ఫలితంగా డజను గుడ్లు వినియోగదారునికి రూ.50కే లభ్యమయ్యేవి. కానీ ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.550కు చేరుకుంది. దీంతో డజను రిటైల్ మార్కెట్‌లో రూ.72కు పెరిగింది. కాగా ఉత్తరాంధ్రలో గుడ్లు పెట్టే (లేయర్) కోళ్లు 45 లక్షల వరకు వివిధ పౌల్ట్రీ ఫారాల్లో పెరుగుతున్నాయి. ఇవి రోజుకు సగటున 35 లక్షల గుడ్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దాదాపు ఈ గుడ్లన్నీ స్థానికంగానే వినియోగమవుతున్నాయి. ఇలా ఇటు చికెన్, అటు కోడి గుడ్ల ధరలు ఎగసి పడుతుండడం నాన్ వెజ్ ప్రియులకు రుచించడం లేదు.



కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 22వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుని తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరుణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమాలు, మహానివేదన నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు ఎదరు సన్నాహ ఉత్సవం అనంతరం ఉత్తర ద్వారం రహదారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణవేదిక మీదకు శ్రీదేవీ భూదేవి సహిత వైభవ వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను తోడ్కొని వచ్చి 6గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసు, శేషు స్వాముల ఆధ్వర్యంలో కల్యాణం సంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. వేదికపై 30మంది కల్యాణ దాతలైన దంపతులు ఆశీనులు కాగా స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. సోమవారం ఉదయాస్తమాన సేవలతోపాటు 9గంటలకు వైభవుడికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహిస్తారు.



పాల్గొన్న కల్యాణదాతలు



వేదికపై శ్రీదేవిభూదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి



పాల్గొన్న భక్తులు

నీటి నాణ్యత.. ఆహార కల్తీ కనిపెట్టేస్తారు

- సమర్థంగా సేవలందిస్తున్న ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల
- నిత్యం పదుల సంఖ్యలో నీటి నమూనాల పరీక్ష



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్ : నీటి నాణ్యతను పరీక్షిస్తారు.. ఆహార పదార్థాల కల్తీని కనిపెట్టేస్తారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణ ధ్యేయంగా సేవలు అందిస్తోంది ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల. పెదవాల్తేరులో ఉన్న ఈ కేంద్రంలో నిత్యం ప్రజలు నీటి, ఆహార పరీక్షలు చేయించుకుంటున్నారు. రాజమండ్రి నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ప్రాంతంలో ఈ కేంద్రం సేవలు అందిస్తుంది.

నీటిని రెండు విభాగాలుగా పరీక్షిస్తారు. కెమికల్ అనాలసిస్, బాక్టీరియా అనాలసిస్ చేస్తారు. కెమికల్ అనాలసిస్‌లో భాగంగా రంగు, వాసన, పి.హెచ్, కాఠిన్యత, క్లోరైడులు, మొత్తం కలిగి ఉన్న లవణాలు, ఐరన్, రెసిడ్యుల్ ఫ్రీ క్లోరిన్, కాల్షియం, మెగ్నీషియం, సల్ఫేటు, నైట్రేటు, ఫ్లోరైడు, మొత్తం కరిగి ఉన్న లవణాలు (టీడీఎస్) వంటివి పరీక్షిస్తారు. నీరు కలుషితం కావడం, బాక్టీరియా చేయడం వంటివి సైతం ఇక్కడపరీక్షిస్తారు. నిత్యం పదుల సంఖ్యలో నీటి నమూనాలు ఇక్కడ పరీక్షకు తీసుకురావడం జరుగుతోంది. ఈ కేంద్రంలో ఉండే ప్రత్యేకమైన శ్యాంపిల్ టేకర్స్ ప్రత్యేకంగా నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తారు. డయేరియా వంటి వ్యాధులు ప్రబలినపుడు డీఎంహెచ్ఓ అధికారులు పంపే నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలను అందిస్తుంటారు. కెమికల్ అనాలసిస్‌కు రూ.230, బాక్టీరియా అనాలసిస్‌కి రూ.150 రుసుముగా చెల్లించాలి. నీటి నమూనా ఫలితాలను వారం రోజుల్లో అందిస్తారు.

ఆహార పదార్థాల్లో..

ఆహార పదార్థాలలో కల్తీని రసాయన పరీక్షలు జరిపి గుర్తిస్తారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను గుర్తించే పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తారు. సాధారణంగా హోటళ్లలో వండే ఆహార పదార్థాలలో, చికెన్‌లో నిషేధిత రంగులు ఉపయోగిస్తే పరీక్షించే అవకాశం, వసతులు ఇక్కడ ఉన్నాయి. ఆహార పదార్థాల్లో జరిగే కల్తీని, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయం గుర్తిస్తారు. మరింత లోతైన సమాచారం, విశ్లేషణ కోసం నమూనాలను హైదరాబాద్ పంపిస్తారు.

సమకూరిన వాహనం

ఇటీవల ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం సమకూరింది. దీనిలో 60కి పైగా పరీక్షలు చేసే సదుపాయాలు ఉన్నాయి. నీరు, పాలు, ఆహార పదార్థాలను పరీక్షించే అవకాశం ఉంది. త్వరలో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ప్రజల్లో అవగాహన కల్పించడం, చైతన్యం పెంచడం, పరీక్షించడం, శిక్షణ అందించడానికి ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఈ మొబైల్ వాహనం నిలుస్తుంది.



నూతనంగా సమకూరిన మొబైల్ పరీక్షల వాహనం

అవగాహన కల్పించాలి

ఆహార ఉత్పత్తుల తయారీ, విక్రయం చేసే సంస్థలకు లైసెన్సులు మంజూరు చేసే సమయంలో అవసరమైన అవగాహన కల్పించాలి. ఆహారాలు తయారీలో వినియోగించకూడని పదార్థాలపై అవగాహన కల్పించాలి. వాటిని వినియోగిస్తే జరిగే దుష్పరిణామాలు తెలియజేయాలి. విక్రేతలకు, వినియోగదారులకు వీటిపై అవగాహన ఉండటం ఎంతో అవసరం.

–ఆర్.శ్రీనివాసులు, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్

నీటి పరీక్షలకు అధికంగా వస్తారు

నీటి నమూనాల పరీక్షకు నిత్యం నమూనాలు వస్తాయి. వీటిని శాస్త్రీయంగా ల్యాబ్‌లో పరీక్షించి, కచ్చితమైన వివరాలను అందిస్తాం. శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదీ, లేనిదీ తెలియజేస్తాం. తద్వారా సురక్షితమైన నీటిని ప్రజలు వినియోగించడానికి సాధ్యపడుతుంది.

– వై.శివరామకృష్ణ, సీనియర్ వాటర్ ఎనలిస్ట్, డీడీవో

ఐఎన్‌ఎస్ జలశ్వను సందర్శించిన సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్లు


ఐఎన్‌ఎస్ జలశ్వ ఓడను సందర్శించిన సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్లు

సింధియా: భారత నౌకాదళం కార్యకలాపాలు, సముద్ర వారసత్వం, లైఫ్ ఆన్ బోర్డ్ షిప్‌లపై సమగ్ర అవగాహనే లక్ష్యంగా సుమారు 100 మంది సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలశ్వ ఓడను సందర్శించారు. సందర్శన సమయంలో సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్లకు భారతనౌకాదళానికి చెందిన వివిధ డొమైన్‌లపై సమగ్ర వివరణను ఓడ సిబ్బంది అందించారు. దేశ ప్రయోజనాలను కాపాడటంలోనూ, సముద్ర భద్రతను పోత్రహించడంలోనూ, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లో పాల్గొనడం వంటి నౌకాదళ సిబ్బంది పాత్రపై వివరించారు. అదే విధంగా క్యాడెట్‌లకు నావికుల దినచర్యలు, విధులు, బాధ్యతలతో పాటు పనిలో వారి సంస్కృతి, ఆన్‌బోర్డ్ షిప్‌లలో వారి జీవితం, నేవీలో సేవ చేయడానికి అవసరమైన త్యాగాలు, అంకితభావం గురించి అవగాహన కలిగించారు. యువతకు దేశభక్తిపై జాతీయ గర్వాన్ని అవలంబించే దిశగా సందర్శన ముగిసిందని నేవీ వర్గాలు తెలిపారు.

బెంగళూరులో విశాఖ వాసి అరెస్టు

- అక్రమంగా సిమ్‌కార్డుల రవాణా

బనశంకరి (బెంగళూరు): భారత సిమ్‌కార్డును వినియోగించి విదేశాల్లో నుంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠా సమాచారాన్ని బెంగళూరు ఈశాన్య విభాగం సైబర్‌క్రైం పోలీసులు ఛేదించారు. వంచక ముఠాకు సిమ్ కార్డులను సరఫరా చేస్తున్న విశాఖపట్టణానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. ముఠా నేరగాళ్లు నకిలీ ఆధారాలను అందించి ఏజెంట్ల ద్వారా వివిధ కంపెనీల సిమ్‌కార్డులను కొనుగోలు చేశారు. బెంగళూరు, చెన్నై, విశాఖపట్టణంతో పాటు దేశంలోని వివిధ మహా నగరాల నుంచి సిమ్‌కార్డులను కొని, యాక్టివేట్ చేసి వియత్నాం, కాంబోడియాకు కొరియర్ ద్వారా పంపించేవారని పోలీసులు తెలిపారు. నిందితుడు విశాఖపట్టణం నుంచి బెంగళూరుకు వచ్చి ఇక్కడి నుంచి కాంబోడియాకు సిమ్‌కార్డులు పంపించేవాడు. అతనిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఉక్కు పరిరక్షణకు పోరాటాలే శరణ్యం


స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన సతీమణి కె.సుజాతతో కలిసి స్టీల్‌ప్లాంట్‌లోని కోక్ ఓవెన్స్, బ్లాస్ట్ ఫర్నేస్, ఎస్.ఎం.ఎస్.తో పాటు రోలింగ్ మిల్స్ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వమన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయక పోవడం వల్లే ప్రధాని మోదీ ఆటలు సాగుతున్నాయన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, దానిని అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం జాతీయ స్థాయిలో ఇండియా కూటమి నేతృత్వంలో ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు జె. రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్ వదిలి.. ఇంగ్లిష్ కోచింగ్ వైపు

ప్రతిభకు పదునుపెడితే సరికొత్త ప్రపంచాన్ని సృష్టించే యువతరానికుంది. పుస్తకాలతో కుస్తీలు, ర్యాంకులు, ఆపై ఐదంకెల జీతంతో ఉద్యోగం.. ఇదీ యువత ఒకప్పటి ఆలోచన. నూతన ఒరవడిలో దూసుకుపోవాలనే కాంక్ష.. తాము నేర్చుకున్న విద్యను పది మందికి పంచితే.. వారికి కూడా అద్భుత భవిష్యత్తును అందించొచ్చు అనే ఆలోచన కొందర్ని కొత్త దారిలోకి తీసుకెళ్తోంది. యువ తరమంటే అంచనా వేసేందుకు కాదు.. అన్వేషించడానికి. నిర్ణయించడానికి కాదు.. అమలు చేయడానికి., స్థిరమైన పనులు చేసేందుకు కాదు.. సాటివారి తలరాతలు మార్చడానికి అన్న మాటల్ని అక్షర సత్యం చేస్తున్నారు ఆ సీబీఐ అధికారి. దర్యాప్తు అధికారిగా లక్షల జీతం ఇస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెప్పి కొత్త మార్గం వైపు పయనిస్తున్నారు.


భీమిలిలో విద్యార్థులకు ఇంగ్లిష్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న శివ (ఫైల్)



- పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో శిక్షణ
- సీబీఐ సీఐగా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసిన నాగవల్లి శివ
- విశాఖ, ఢిల్లీ బ్రాంచ్‌లలో విధులు నిర్వర్తించిన శివ
- విశాఖలో పేద విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అకాడమీ ఏర్పాటు
- ఇంగ్లిష్ ఈజీగా నేర్చుకునేలా శివ రచనలు


శివ రచించిన పుస్తకాలు

సాక్షి, విశాఖపట్నం : సమాజంలో యువత రెండు రకాలు. ఏదైనా సమస్యను చూస్తారు.. వదిలేస్తారు. మరికొంతమంది ఆ సమస్యకు పరిష్కారం దొరికేవరకూ అన్వేషిస్తారు. అవసరమైతే మరికొంతమందితో చర్చిస్తారు. విభిన్న ఆలోచనల్ని, పరిష్కార మార్గాల్ని సేకరిస్తారు. ఆ కోవకు చెందిన వారే నాగవల్లి శివ. మారుమూల పల్లెలో పుట్టి కేంద్ర దర్యాప్తు సంస్థలో ఉద్యోగాన్ని సాధించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన శివ పేదింట్లో పుట్టారు. చిన్నప్పుడు ట్యూషన్లు చెప్పుకుంటూ తల్లిదండ్రుల్ని ఇబ్బంది పెట్టకుండా తన చదువుకు అవసరమైన డబ్బును సమకూర్చుకునేవారు. ఎంఏ ఇంగ్లిష్‌ని డిస్టింక్షన్‌లో పాసైన శివ.. 2012లో డీఎస్‌సీ రాసి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అనంతరం 2014లో ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రూప్‌–4లో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లోనూ, గ్రూప్‌–3లో ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌లో కొలువులు సాధించారు. అయినా ఏదో వెలితి శివని వెంటాడింది.

పాతికేళ్ల ప్రాయంలోనే రచయితగా..

ఓవైపు సామాజిక సేవా కార్యక్రమాలు, మరోవైపు ఉద్యోగాలే టార్గెట్‌గా నిర్దేశించుకున్న శివ పాతికేళ్ల వయసులోనే రచయితగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇంగ్లిష్ భాషపై తాను సాధించిన పట్టు.. ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో ఇంగ్లిష్ వ్యాకరణం అనే పేరుతో.. ప్రతి ఒక్క తెలుగు విద్యార్థి సులువుగా గ్రామర్ నేర్చుకునేలా పుస్తకాన్ని 2011లో రాశారు. వెంటనే వెర్బ్స్ అండ్ ఇట్స్ కాంజుగేషన్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల్ని రచించగా దీన్ని వీజీఎస్ సంస్థ అచ్చేసేందుకు ముందుకొచ్చింది. ఈ పుస్తకాలు 2015లో మద్రాస్‌లోని కన్నెమర సెంట్రల్ లైబ్రరీలో చోటు దక్కించుకుంటూ జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. ఒకే టికెట్‌పై 15 సినిమాల పేరుతో రాసిన పుస్తకం సంచలనంగా మారింది. శివ పుస్తకాలు అమెజాన్‌లోనూ బెస్ట్ సెల్లర్ బుక్స్‌గా చోటు దక్కించుకున్నాయి. శివ రచనలకు జాతీయ స్థాయిలో సత్కారాలు వరించాయి.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో సత్తా..

ఏదైనా నిజాయితీగా పనిచేస్తూ.. దేశానికి సేవ చెయ్యాలన్నదే శివ లక్ష్యం. అందుకే స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) రాయాలని నిర్ణయించుకున్నారు. 2015లో ఎస్ఎస్‌సీ సీబీఐ ఎస్ఐ రాతపరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రం నుంచి ఎంపికైన నలుగురిలో శివ ఒకరిగా నిలిచారు. ఘజియాబాద్‌లోని సీబీఐ అకాడమీలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తర్వాత 2017లో సీబీఐ ఎస్ఐగా విధుల్లో చేరారు. వైజాగ్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధుల్లో చేరిన శివ.. అనేక కీలకమైన కేసుల్లో పురోగతి వచ్చేలా ప్రతిభ కనబరిచారు. అందుకే ఐదేళ్లలోనే సీఐగా పదోన్నతి పొందారు. వైజాగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సీబీఐ బ్రాంచ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు కూడా. పదోన్నతి పొందిన తర్వాత 6 నెలల క్రితం సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు శివ బదిలీ అయ్యారు. ఇదే సమయంలో శివకు కొత్త ఆలోచన వచ్చింది.

తెలుగు వాళ్లకు ఉద్యోగాలే లక్ష్యంగా..

ఢిల్లీలో విధుల్లో చేరినప్పుడు.. అక్కడ ఉన్న తోటి ఉద్యోగులతో మాట్లాడుతుండగా.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగువారు చాలా తక్కువగా ఉన్నారని గ్రహించారు. దీనికి కారణమేంటని శోధిస్తే.. ఇంగ్లిష్ భాష అని తెలుసుకున్న శివ.. ఈ గ్యాప్‌ని తగ్గించి.. తెలుగు వారు ఎందులోనూ తక్కువ కాకూడదని అనుకున్నారు. అందుకే సీబీఐ ఉద్యోగానికి రాజీనామా చేసి నేరుగా విశాఖ చేరుకున్నారు. తక్కువ ఖర్చుతో విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటు పోటీ పరీక్షలకు తర్ఫీదునిచ్చేందుకు త్రినేత్ర పేరుతో అకాడమీని స్థాపించారు. ఇంగ్లిష్ భాషలో ప్రతి తెలుగు విద్యార్థి ప్రావీణ్యం పొందేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు. అందుకే లక్షల రూపాయల జీతం ఇచ్చే ఉద్యోగాన్ని వదులుకున్నా తనకేమీ బాధగా లేదని.. భార్య అంజలి కూడా ప్రోత్సహించడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందంటున్నారు. విద్య విజ్ఞానాన్ని, ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తుందని, అది పది మందికి పంచితే సమాజం మరింత మెరుగవుతుందన్న లక్ష్యంతోనే అకాడమీ స్థాపించానని శివ చెబుతున్నారు. శివ చేసిన ఈ ప్రయోగానికి సీబీఐ అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

ప్రగతి పథంలో హార్బర్


ఫిషింగ్ హార్బర్‌లో కొత్తగా వేస్తున్న రోడ్లు


హార్బర్‌లో ఆంక్షన్ హాలు నిర్మాణం


హార్బర్‌లో నిలిచి ఉన్న మరబోట్లు


మత్స్యకారుల వెయిటింగ్ హాలు

- శరవేగంగా హార్బర్ ఆధునికీకరణ పనులు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్న హార్బర్ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. దీంతో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హార్బర్‌కు అదనపు హంగులు సమకూర్చుతున్నారు. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

వివిధ దశల్లో ఉన్న పనులు ఇలా..

మొత్తం అన్ని పనులను ఏడు దశల్లో చేపట్టాలని నిర్ణయించి ప్రారంభించారు. మొదటి దశలో ప్యాకేజీ యూనిట్/కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లను రూ.37.26 కోట్లతో చేపడుతున్నారు. రెండో దశలో విద్యుత్ పనులు, మూడో దశలో రెండు ఆక్షన్ హాళ్లు, రిటైనింగ్ వాల్, నాల్గో దశలో ట్రీట్‌మెంటు ప్లాంట్, ఐదో దశలో ఫ్లోటింగ్ జెట్టీ, ఆరో దశలో డ్రెడ్జింగ్ పనులు, ఏడో దశలో టైర్ ఫెండర్లు ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టారు. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో మరి కొన్ని పనులు చేయాలని మత్స్యకారులు ప్రతిపాదనలు సమర్పించారు. ఫ్లోటింగ్ జెట్టీ స్థానంలో శాశ్వత జెట్టి, మూడో ఆక్షన్ హాలు నిర్మించాలని, బీచింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో భేటీలో ఈ విషయాన్ని మత్స్యకారులు ప్రస్తావించారు. ఈ పనులకు అధికారులు ఎస్టిమేంటు వేయించారు. ముందు అనుకున్న దాని కన్నా అదనంగా నిధులు ఖర్చవుతాయి. హార్బర్ ఆధునికీకరణ కోసం ముందు రూ.151.81 కోట్లు నిధులు అవసరమవుతాయని భావించారు. ఇప్పుడు అదనంగా రూ.178.51 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

మంచి పరిణామం



అభివృద్ధి పనులు చేపట్టడం మంచి పరిణామంగా భావిస్తున్నాం. గతంలో లేనివిధంగా హార్బర్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే మత్స్యకారులకు సంబంధించి వివిధ సమస్యలు తీరుతాయి. ఇంకా మరిన్ని కొన్ని సమస్యలు తీర్చాల్సి ఉంది.

– వాసుపల్లి జానకీరామ్, ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలు తీరుతాయి



అభివృద్ధి పనులు మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. దీనివల్ల కొన్ని సమస్యలు తీరుతాయని భావిస్తున్నాం. మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. గతంతో పోల్చిస్తే ఇప్పుడు హార్బర్ ప్రగతి పథంలో నడుస్తోంది.

– బర్రి కొండబాబు, బోటు యాజమాని, ఫిషింగ్ హార్బర్

ఇంకొన్ని విన్నవించాం..



మత్స్యకారులకు ఇంకా అనేక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. డాక్‌లో బోట్లు నిలుపుదల చేసుకొని ఎనిమిది కేడిల్ కావాలి. ఆశీల షెడ్డులో రేకుల షెడ్డు కాకుండా పర్మినెంట్ షెడ్డు వేయాలి. జెట్టి 2, 3లో చేపల యాక్షన్ పాట పెట్టుకుంటాం. అక్కడ ఉన్న బోట్లు తొలగించాలి. డ్రైనేజీ వాటర్ సముద్రంలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరాం.

– సూరాడ సత్యనారాయణ, బోటు యాజమాని,

అందాలు అదరహో ..

మన్యంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. ఆదివారం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు కొత్త అందాలను ఆవిష్కరించాయి. వంజంగి హిల్స్‌లో మంచు అందాలు అబ్బురపరిచాయి.లంబసింగి, చెరువులవేనంలో ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేశాయి. పాడేరులో సప్తవర్ణాలతో ఇంద్ర ధనస్సు అలరించింది. – సాక్షి, పాడేరు, చింతపల్లి రూరల్







మోదమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం


మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు


మోదమ్మ దర్శనంకు ఆలయం రోడ్డులో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

- ఇంటి పండగలతో సందడి
- అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఘటాల సమర్పణ

సాక్షి,పాడేరు: గిరిజనుల ఇలవేల్పు,ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వెండి, బంగారు ఆభరణాలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్‌లో బారులు తీరారు.

అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఇంటి పండగలతో సందడి నెలకొంది. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాదనాయుడు, వెంకటరమణ, శ్రీను తదితరులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, గర్భిణుల కోసం ప్రత్యేక దర్శన కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు


అమ్మవారి ఘటాలను ఆలయానికి తీసుకు వస్తున్న భక్తులు